సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం । 7 । మార్చి । 2025



తీరొక్క పంటలు
కృష్ణానదిలో బ్యాక్‌వాటర్ తగ్గిపోవడంతో రైతులు రకరకాల పంటలు సాగు చేస్తున్నారు.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-30 (శుక్రవారం సాయంత్రం)
సహర్ 5-07 (శనివారం తెల్లవారుజామున)

వాతావరణం
గరిష్టం/కనిష్టం 39.2 /16.6
మధ్యాహ్నం వేళల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

హత్య కేసుపై డీఎస్పీ, సీఐల విచారణ

గట్టు: ఓ హత్య కేసుకు సంబంధించి నింది తుడిని పోలీసులు కస్టడీలోకి తీసుకోగా.. సదరు నిందితుడి స్వగ్రామం లింగాపురంలో గద్వాల డీఎస్పీ మొగులయ్య, శాంతినగర్ సీఐ టాటాబాబు, ఎస్ఐ శ్రీనివాస్, అయిజ, గట్టు ఎస్ఐలు రాజశేఖర్, మల్లేష్ గురువారం విచారణ నిర్వహించారు. శాంతినగర్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసుకు సంబంధించి లింగాపురం గ్రామానికి చెందిన ఉత్తనూర్ నర్సింహులు నిందితుడు. ఇతను జైలులో ఉండగా.. విచారణ నిమిత్తం పోలీసులు కోర్టు ద్వారా కస్టడీలోకి తీసుకున్నారు. ఈమేరకు లింగారానికి చేరుకొని నిందితుడి పూర్తి వివరాలు ఆరా తీశారు.

1,018 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం 1,018 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 550 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా.. సమాంతర కాల్వ ద్వారా నీటి సరఫరా లేదన్నారు. ఎన్టీఆర్ కాల్వకు 84 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 119 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

ప్రాజెక్టు రూపకల్పనపై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో వాణిజ్యశాస్త్ర విభాగం విద్యార్థులకు ప్రాజెక్టు రూపకల్పనపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ చెన్నప్ప మాట్లాడుతూ బ్యాంకింగ్, బీమా, వ్యాపార, వాణిజ్య వంటి అంశాలను ఎన్నుకుని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఇలాంటి ప్రాజెక్టుల పరిశోధనల ద్వారా విద్యార్థుల వికాసం, సృజనాత్మకత, విశ్లేషణ నైపుణ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కంట్రోలర్ రాజ్‌కుమార్, అనురాధారెడ్డి, రంగప్ప, సురేష్ పాల్గొన్నారు.

ఆరుగురికి పదోన్నతి

మహబూబ్‌నగర్ క్రైం: జోగుళాంబ జోన్–7 పరిధిలో ఆరుగురు కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి ఇస్తూ గురువారం డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి వచ్చిన వారిలో చిన్ను నాయక్, బాలయ్య, బి.రాజు, వి.నాగరాజు, ఎం.వెంకటయ్య, రాములు, రాజేషం ఉన్నారు. వీరికి ఉమ్మడి జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో పోస్టింగ్‌లు కేటాయించారు.

ఆయుధ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

వనపర్తి: విధుల్లో వినియోగించే ఆయుధాలపై జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లిలోని 10వ బెటాలియన్‌లో గురువారం ఉదయం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి మూడురోజుల ఫైరింగ్ శిక్షణ నిర్వహించారు. పోలీసులు విధుల్లో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. ఒక్కొక్కరు పది రౌండ్లు కాల్చే అవకాశం కల్పించారు. ఎస్పీ స్వయంగా పాల్గొని జిల్లా సాయుధ దళాల అదనపు ఎస్పీ, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఫైరింగ్ చేసి ఆయుధ నైపుణ్యాన్ని పరీక్షించుకున్నారు. ఫైరింగ్ శిక్షణలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయుధాలను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలని సూచించారు. వ్యాయామం చేయడం చాలా ముఖ్యమని, శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వర్తించవచ్చన్నా రు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి జీవ న విధానాన్ని అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి జిల్లాకు, పోలీసుశాఖకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. వ్యక్తిగత, ఆరోగ్య సమస్యలు, డ్యూటీలో ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సైబర్‌క్రైం డీఎస్పీ రత్నం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, సీఐలు కృష్ణ, రాంబాబు, శివకుమార్, రిజర్వ్ ఎస్ఐలు వినోద్, ఎండీ మొగ్దుం, జిల్లాలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మోక్షమెప్పుడో..?

అంతర్రాష్ట్ర రహదారిపై హైలెవల్ బ్రిడ్జి లేక ఇబ్బందులు



కాజ్‌వేపై భారీ వాహనాలు వెళ్లకుండా పహారా కాస్తున్న పోలీసులు

- ఏపీ, తెలంగాణ, కర్ణాటక వాసులను కలిపేలా పెద్దవాగుపై కాజ్‌వే నిర్మాణం
- భారీ వాహనాల రాకపోకలతో శిథిలావస్థకు చేరిన వైనం
- ఇటీవల వాహనాలను అనుమతించకుండా పోలీసులు పహారా
- కలెక్టర్ పరిశీలన.. అయినా సమస్య పరిష్కారం కాక ఇబ్బందులు

అయిజ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలను కలిపే కర్నూలు–రాయచూరు అంతరాష్ట్ర రహదారిపై అయిజ సమీపంలోని పెద్దవాగు వద్ద కొన్నేళ్ల క్రితం నిర్మించిన కాజ్‌వే పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో మూడు రాష్ట్రాల మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను కాజ్‌వే గుండా వెళ్లేందుకు పోలీసులు నిరాకరిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో కాజ్‌వే రక్షణ గోడలు శిథిలమై.. రంధ్రాలు పడగా తూతూ మంత్రంగా మరమ్మతులు చేశారు. ఇటీవల మరోసారి గోతులు పడగా మంగళవారం నుంచి భారీ వాహనాలను కాజ్‌వే గుండా అనుమతించడంలేదు. పోలీసులు ఆర్అండ్‌బీ వారికి సమాచారమిచ్చినా.. అటు అధికారులు, ఇటు పాలకులు స్పందించడం లేదు.

మూడు రాష్ట్రాల ప్రజల రాకపోకలు

ఈ కాజ్‌వేపై మూడు రాష్ట్రాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ప్రతి రోజు వేల సంఖ్యలో వాహనాలు ఈరోడ్డుపై వెళ్తుంటాయి. అలాంటి రోడ్డుకు అడ్డుగా అయిజ పట్టణ సమీపంలో పెద్దవాగు ఉంది. వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించకపోవడంతో భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంటుంది. గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన కాజ్‌వేపై వరదనీరు ఉధ్రుతంగా ప్రవహించినప్పుడు ప్రయాణానికి ఆటంకం ఏర్పడుతుంది. ఎక్కడికి వాహనాలు అక్కడే నిలిచిపోవాల్సి ఉంటుంది. ఇటీవల కాజ్‌వేపై పెద్ద గొయ్యి ఏర్పడగా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కాజ్‌వే రక్షణ గోడలు బీటలు వారాయి. గోడకు నిర్మించిన రాళ్లు ఊడిపోతున్నాయి. విధిలేక వాహనదారులు వేరే మార్గంపై వెళ్లాలంటే 50 కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. కర్ణాటక రాష్ట్ర ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు వెళ్లాలంటే రాయచూరు నుంచి గద్వాల మీదుగా.. అలాగే ఏపీ ప్రజలు కర్ణాటకలోని రాయచూరుకు వెళ్లాలనుకుంటే గద్వాల మీదుగా రావాల్సిందే. ఇక రాష్ట్ర ప్రజలు రాయచూరుకు వెళ్లాలన్నా చుట్టూ తిరిగి గద్వాల మీదుగా వెళ్లాల్సిందే. దీంతో ప్రయాసాలతోపాటు వెలకట్టలేని సమయం వృథా చేసుకోవాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

బ్రిడ్జితోనే శాశ్వత పరిష్కారం



పెద్దవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రాణాపాయంలో ఉన్న వారికి అత్యవసర సేవలందించేందుకు కర్నూలుకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. గతంలో నిర్మించిన కాజ్‌వే పై తరుచూ గుంతలు ఏర్పడడంతో రోడ్డు దాటలేని పరిస్థితి నెలకొంది. దానివలన 108 సేవలకు ఆటంకం కలుగుతుంది. హై లెవల్ బ్రిడ్జి నిర్మిస్తే వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగకుండా ఉంటుంది.

– శ్రీధర్ 108 సిబ్బంది, అయిజ మండలం

పహారా కాస్తున్నాం



పట్టణ సమీపంలోని అంతర్రాష్ట్ర రహదారిపై గతంలో నిర్మించిన కాజ్‌వే పూర్తిగా శిథిలమైంది. ఇటీవల కాజ్‌వేపై భారీ గుంత పడింది. అధిక లోడుతో ఉన్న వాహనాలు వెళ్లకుండా పోలీసులు కాపలా ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గతంలో ఇలా జరిగితే మరమ్మతు చేసేంత వరకు ఎలాంటి ప్రమాదం జరగకుండా రాత్రింబవళ్లు కాపలా కాశాం.

– శ్రీనివాసరావు, ఎస్ఐ, అయిజ

నివేదికలు పంపించాం..

అయిజ–రాయచూర్ రోడ్డుపై అయిజ పట్టణ సమీపంలో పెద్దవాగుపై నిర్మించిన కాజ్‌వే పూర్తిగా శిథిలమైంది. భారీ వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. కాజ్‌వేను తొలగించి హైలెవల్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉంటుంది. దీని కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. నిధులు మంజూరైతే బ్రిడ్జి నిర్మాణం చేపడతాం.

– దేశ్యానాయక్, ఆర్అండ్‌బీ ఈఈ

హైలెవల్ బ్రిడ్జిపైనే ఆశలు..

గతంలో కాజ్‌వే శిథిలావస్థకు చేరుకొని వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయం కలెక్టర్ బీఎం సంతోష్ దృష్టికి వెళ్లగా.. ఆయన నేరుగా కాజ్‌వేను సంబంధిత శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. కాజ్‌వే పూర్తిగా శిథిలమైందని, వాహనాలు వెళ్తే ప్రమాదమని పేర్కొంటూ.. తాత్కాలికంగా కాజ్‌వేకు మరమత్తులు చేసి వేసవి కాలంలో కాజ్‌వేను కూల్చివేసి దాని స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అయినా సరే ఇప్పటి వరకు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ముందడుగు పడడంలేదు. ఇదిలాఉండగా, అత్యవసర వైద్య సేవలైన కాన్పులు, రోడ్డు ప్రమాద బాధితులను నిత్యం అయిజ నుంచి ఏపీ రాష్ట్రంలోని కర్నూలుకు అంబులెన్స్‌లలో తరలిస్తుంటారు. కాజ్‌వే పూర్తిగా శిథిలం కావడంతో అంబులెన్స్ వాహనాలు గద్వాలకు చేరుకొని అక్కడ నుంచి జాతీయ రహదారిపై కర్నూలుకు వెళ్తుండడంతో అత్యవసర సేవలు ఆలస్యం కావడంతో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి.



శిథిలమైన కాజ్‌వేను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్ (ఫైల్)

చేతివృత్తుల వారికి ఆర్థిక తోడ్పాటు



మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: సాంప్రదాయ చేతివృత్తుల వారికి ఆర్థికంగా మరింత స్థిరపడేందుకు రూపొందించిన పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పీఎం విశ్వకర్మ పథకంపై ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న చేతికులవృత్తుల వారికి చేదోడుగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కులవృత్తులపై ఆధారపడి జీవించే వారిలో సామర్థ్యాన్ని పెంచి నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉత్పాదకత, నాణ్యత, ఉత్పత్తులను మెరుగుపర్చి ఆర్థికంగా చేయూతనిస్తూ జీవనోపాధిని అభివృద్ధి చేయడమే ఈపథకం లక్ష్యమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, చాకలి, మంగలి, ఉప్పరి, ఎరుకలి, దర్జీ తదితర 18 కులవృత్తుల వారికి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారాల ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు శిక్షణతో పాటు రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈపథకంలో చేరడం ద్వారా విశ్వకర్మ సర్టిఫికెట్, ఐడీ కార్డుతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ టూల్‌కిట్లు, రుణసదుపాయం, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహం మార్కెటింగ్‌కు మద్దతు లభిస్తుందని తెలిపారు.

ఉచిత శిక్షణ.. రుణాలు

18 సంవత్సరాలు పైబడిన కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులని ఎలాంటి విద్యార్హత లేకున్నా పేరు నమోదు చేసుకోవచ్చని, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండరాదన్నారు. విశ్వకర్మగా పేరు నమోదు ద్వారా ఆన్‌లైన్‌లో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుబుక్, మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలని అనంతరం దరఖాస్తులను గ్రామ పంచాయతీ స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయి అమలు కమిటీకి పంపుతుందని తెలిపారు. ఎంపికైన వారికి రెండు రకాలుగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రాథమిక నైపుణ్యం ద్వారా ఐదు నుంచి ఏడు రోజులు, అధునాతన నైపుణ్యానికి 15 రోజులు శిక్షణ అందిస్తూ శిక్షణ కాలంలో ప్రతిరోజు రూ.500 భృతి ఇవ్వడంతో పాటు శిక్షణ అనంతరం రూ.15వేల విలువైన టూల్ కిట్లు, ధ్రువీకరణ పత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు. రెండువిడతలుగా మొత్తం రూ.3లక్షల రుణం అందించనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో రూ.లక్ష, రెండో విడతలో రూ.2 లక్షలు అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారికి రుణాలు మంజూరీ చేయడంలో బ్యాంకర్లు సహకరించాలన్నారు. ఈ రుణానికి సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పరిశ్రమల జిల్లా అధికారి రామలింగేశ్వర్‌గౌడ్, మైక్రో,స్మాల్, మీడియం ఎంటర్‌పైజెస్ ఏడీ శివరామ్‌ప్రసాద్, ఢిల్లీ ప్రతినిధి సంజీవ్‌కుమార్ సైని, ఇంచార్జీ డీపీవో నాగేంద్రం, ఎల్‌డీఎం అయ్యప్పురెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు, చేనేత జౌళి ఏడీ గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న చేతివృత్తిదారులు

పకడ్బందీగా నీట్ పరీక్ష

గద్వాల: నీట్ యూజీ–2025 పరీక్షను అత్యున్నత ప్రమాణాలతో పకడ్బందీగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాలలో అన్ని రకాల మౌళిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, పాలిటెక్నిక్ కాలేజీలను నీట్ పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేయటానికి ఎస్పీ శ్రీనివాస్‌రావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన గదుల్లో వసతులు, సీటింగ్ కెపాసిటీ, సీసీటీవీ నిఘా, టాయిలెట్లు, వెంటిలేషన్ తదితర అంశాలను పరిశీలించి పాఠశాల అధ్యాపక బృందానికి అవసరమైన సూచనలు చేశారు. నీట్ పరీక్షా మార్గదర్శకాలను అనుసరించి విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. అదేవిధంగా ప్రశ్నపత్రాల భద్రతాలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు ఇమ్మన్యూల్, జహీరుద్దీన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 102 మంది గైర్హాజరు

గద్వాలటౌన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు దాదాపు అర గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. జనరల్, ఒకేషనల్ విభాగాలలో మొత్తం 3,685 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 3,583 మంది విద్యార్థులు హాజరయ్యారు. 102 మంది గైర్హాజరయ్యారు. అలాగే, జనరల్ విభాగంలో 3,027 మంది విద్యార్థులకుగాను 2,945 మంది.. ఒకేషనల్ విభాగంలో 658 మందికిగాను 638 మంది విద్యార్థులు హాజరయ్యారు. 97 శాతం హాజరు నమోదు అయింది. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను ఇంటర్ విద్యా జిల్లా అధికారి హృదయరాజు తనిఖీ చేశారు. పరీక్షలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు 144 సెక్షన్‌ను కేంద్రాల వద్ద అమలు చేశారు.

కృష్ణా జలాల కేటాయింపుపై పోరాడాలి

పాలమూరు: కృష్ణా బేసిన్‌లోని అన్ని జిల్లాలలో నీటి వాటా కోసం కృష్ణానది జల సాధన జేఏసీలు ఏర్పాటు చేసి పోరాడాల్సిన అవసరం ఉందని పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు హరగోపాల్, కన్వీనర్ రాఘవాచారి గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు నిధులు అన్నింటిని ఆంధ్ర ప్రాంతాల్లో వెచ్చించి, కృష్ణానది జలాల దోపిడీకి పాల్పడ్డారని ఆ క్రమంలో ఎన్నో పోరాటాలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ వచ్చినా.. పార్టీల అధికారం మారినా.. స్థానిక రైతులకు సాగునీరు ఇవ్వలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర పక్షపాత ధోరణి ప్రదర్శిస్తూ తెలంగాణకు నీటి వాటా పంపిణీ చేయలేదని, గత ప్రభుత్వం కేంద్రంతో పోరాడి నీటివాటా సాధించడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలల గడుస్తున్నా కృష్ణానది జల సాధనకు కృషి చేయడం లేదని విమర్శించారు.

ఏమైపోయారో..

నేటికీ అంతుచిక్కని 8 మంది కార్మికుల ఆచూకీ

- ఎస్ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు
- తాజాగా రంగంలోకి కేరళ క్యాడావర్ డాగ్స్
- ఐఐటీ నిపుణులతో టన్నెల్‌లోకి సింగరేణి, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు



సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న కేంద్ర హోం శాఖ కార్యదర్శి కీర్తి ప్రతాప్ సింగ్

అచ్చంపేట రూరల్: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 13 రోజులుగా ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న 8 మంది కార్మికుల జాడ గుర్తింపు కోసం అన్వేషణ కొనసాగుతోంది. తిండీ తిప్పలు దేవుడెరుగు.. కనీసం గాలి, వెలుతురు కూడా లేకుండా ఊపిరి సలపని చీకటి గుహలో తమ వారు ఎలా ఉన్నారో.. ఏమైపోయారో అంటూ టన్నెల్ వెలుపల కార్మికుల కుటుంబాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఎదురుచూస్తూనే ఉన్నాయి. దోమలపెంట ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న వారి కోసం 13 రోజులుగా సహాయక చర్యలు చేపడుతున్నారు. గురువారం పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ సహాయక బృందాలకు దిశానిర్దేశం చేస్తూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ సూచనలు చేశారు. ఈ క్రమంలోనే సొరంగం లోపల చిక్కుకున్న వారిని గుర్తించేందుకు కేరళ రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా క్యాడావర్ డాగ్స్ రప్పించినట్లు అరవింద్‌కుమార్ తెలిపారు. గురువారం ఉదయం షిఫ్టులో సింగరేణి, ఐఐటీ నిపుణులతోపాటు సైనిక అధికారులు సొరంగం లోపలికి వెళ్లారు.

మట్టి తరలింపులో ఇబ్బందులు..

సొరంగంలో పేరుకుపోయిన, మట్టి, రాళ్లు, బురద బయటకు పంపడానికి సింగరేణి కార్మికులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. జీపీఆర్ మిషన్ చూయించిన చోట 6, 7 మీటర్ల లోపల ఉన్న అవశేషాల కోసం ప్రతిరోజు అన్వేషణ కొనసాగుతోంది. జీపీఆర్ చూయించిన ప్రదేశంలోనే ఎక్కువ శాతం పనులు కొనసాగిస్తుండటం, చివరికి ఆ ప్రాంతంలో ఎలాంటి అవశేషాలు కనిపించకపోవడంతో శ్రమిస్తున్న సింగరేణి కార్మికులకు నిరాశే మిలుగుతోంది. దీనికి తోడు 7 మీటర్ల లోతులో మట్టిని తవ్వి పక్కనే పడేస్తున్నారు. మట్టిని తవ్వడానికి కార్మికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. కన్వేయర్ బెల్ట్ పనులు కొనసాగితే ఆ మట్టి, రాళ్లు, ఇతర శిథిలాలను బయటకు పంపిస్తే పని సులువవుతుందని కార్మికులు అంటున్నారు. గోతులు తవ్వితే అధికంగా నీరు, బురద వస్తుంది. దీంతో ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది.

అందుబాటులో ఉండాలి..

సొరంగం వద్ద సహాయక చర్యల్లో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి సహకరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. అందరూ సమన్వయంతో, సహకారం అందిస్తూ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వివిధ విపత్తుల ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది సొరంగ ప్రాంతానికి వస్తున్నారని, వారికి అన్ని వసతులు కల్పిస్తూ.. సర్వే, ఇతర పనులు చేయించుకోవాలన్నారు. ఐఐటీ నిపుణులు, సింగరేణి సాంకేతిక నిపుణులు, సైనిక అధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఉదయం ఒక చివర నుంచి మట్టిని తీసి ఎక్సలేటర్‌పై వేస్తూ నీటిని మరోవైపు దారి మళ్లిస్తూ ముందుకు సాగాలని సూచించారు. సింగరేణి సిబ్బందితో పాటు యాంత్రిక సహకారం తీసుకుంటూ మనుషులు బురదను బయటికి తరలించేందుకు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. టన్నెల్ లోపల పనిచేసే వారికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఎన్‌డీఆర్ఎఫ్, సింగరేణి అధికారులు, ఐఐటీ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులు పడిగాపులు..

టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులకు సంబంధించి కుటుంబసభ్యులు దోమలపెంట జేపీ కంపెనీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కంపెనీ యజమానితో మాట్లాడటానికి కుటుంబ సభ్యులు చూస్తుండగా.. కంపెనీ అధికారులు, సిబ్బంది పొంతన లేని సమాధానం చెబుతూ వారిని అక్కడి నుంచే పంపించే ప్రయత్నాలు చేస్తున్నారు. గురువారం ఓ కార్మికుడి కుటుంబసభ్యులు కార్యాలయం వద్దకు వచ్చి ఆరా తీశారు. అదే సమయంలో జేపీ కంపెనీ యజమాని హెలీకాప్టర్‌లో వస్తుండటంతో అక్కడి నుంచి వారిని పంపించేశారు.



కట్‌చేసిన టీబీఎం విడి భాగాలను టిప్పర్‌లో తరలిస్తున్న దృశ్యం

లాంగిట్యూడ్, లాటిట్యూడ్ ఆధారంగా..

భూ ప్రకంపనలు, భూమిలో ప్రయాణించే ప్రత్యాస్తి తరంగాలను అధ్యయనం చేసే నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రతినిధుల బృందం సొరంగం ప్రాంతానికి చేరుకుంది. వారితో ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి.. సర్వే చేసి కచ్చితమైన నివేదిక అందించాలని కోరారు. గురువారం అమ్రాబాద్ రేంజ్‌లో లాంగిట్యూడ్, లాటిట్యూడ్ ఆధారంగా సర్వే చేయనున్నట్లు తెలిసింది. స్థానిక ఫారెస్టు అధికారులు వారికి సహకరిస్తున్నారు.

- సహాయక చర్యలను కేంద్రం నుంచి వచ్చిన మినిస్ట్రీ ఫర్ హోం అఫైర్స్ నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సెక్రటరీ కల్నల్ కీర్తి ప్రతాప్ సింగ్ పరిశీలించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఆయనకు రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి అరవింద్‌కుమార్ టన్నెల్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, కొనసాగుతున్న సహాయక చర్యలను వివరించారు. ప్రస్తుతం టీబీఎంను కొద్దికొద్దిగా కట్ చేస్తూ కార్మికులను అన్వేషిస్తున్నట్లు చెప్పారు. కన్వేయర్ బెల్ట్ మళ్లీ ప్రారంభం కావడంతో మట్టిని బయటికి తరలించే ప్రక్రియ మొదలైతే సహాయక చర్యలు వేగవంతం కానున్నాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

కేఎల్ఐ కాల్వలో పడి వృద్ధురాలు మృతి

బిజినేపల్లి: కేఎల్ఐ కాల్వలో పడి గుర్తుతెలియని వృద్ధురాలు (60) మృతి చెందింది. ఈ ఘటన బిజినేపల్లి మండలం పోలేపల్లి గ్రామ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వ్యవసాయ పొలాలకు వెళ్తున్న రైతులు కేఎల్ఐ కాల్వలో పడిన వృద్ధురాలిని గమనించి.. కాపాడలనే ఉద్దేశంతో ఒడ్డుకు చేర్చారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వృద్ధురాలి మృతదేహాన్ని జిల్లా మార్చురీకి తరలించారు. వృద్ధురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

దేవరకద్ర: జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఓ మూగ వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే ఎస్ఐ అక్బరుద్దీన్ తెలిపారు. కౌకుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో గాయాలతో పడి ఉండగా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని.. మరిన్ని వివరాలకు రైల్వే ఎస్ఐని సంప్రదించాలని సూచించారు.

మహిళ బలవన్మరణం

అచ్చంపేట రూరల్: ఉరేసుకొని ఓ మహిళ మృతిచెందిన ఘటన గురువారం అచ్చంపేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని ఇంద్రానగర్‌కాలనీకి చెందిన లక్ష్మి (29) భర్త వదిలేయడంతో ఇక్కడే ఉంటూ ఫైనాన్స్ వ్యాపారం చేసేది. పట్టణంలోని సీతరాలగుట్ట సమీపంలో చెట్టుకు ఉరేసుకుని మృతిచెందగా తెల్లవారుజామున స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి నిరంజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు వివరించారు. లక్ష్మి కాలనీలో ఉండే మరో వ్యక్తితో కలిసి సహ జీవనం సాగించేదని.. వారిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవ జరిగిందని తండ్రి వివరించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

బల్మూర్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువు మునిగి మృతిచెందిన ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని గట్టుతుమ్మెన్‌కు చెందిన మల్లయ్య (41) బుధవారం సాయంత్రం గ్రామ సమీపంలో ఉన్న చెరువులో చేపల వేటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. గురువారం ఉదయం చెరువులో మృతదేహం గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ రమాదేవి తెలిపారు. భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మల్లయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

హన్వాడ: మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళ చెరువులో దూకి మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని కొనగట్టుపల్లి గ్రామానికి చెందిన దర్పల్లి లక్ష్మి(45) గురువారం హన్వాడ పెద్ద చెరువు వైపు వెళ్లింది. వెళ్లిన వెంటనే చెరువులోకి దూకిన లక్ష్మిని అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి మృతదేహం లభ్యమైంది. కాగా లక్ష్మికి మతిస్థిమితంగా సరిగ్గా లేక గతంలోనూ ఇదే చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడగా స్థానికులు కాపాడినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన లక్ష్మి ఇంటికి తిరిగి రాకుండా హన్వాడ పెద్దచెరువులో దూకి మృతిచెందింది. లక్ష్మికి భర్త దర్పల్లి నర్సింహులుతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గద్వాల క్రైం: గుర్తుతెలియని దుండగులు తాళం వేసిన ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని రాజవీధికి చెందిన స్వర్ణకారుడు సంజీవ్ ఆచారి తమ బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండటంతో గురువారం ఉదయం ఇంటికి తాళంవేసి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువాలో ఉన్న దాదాపు 5 కిలోల వెండి, 7 తులాల బంగారం ఆభరణాలతో పాటు రూ. 1.30లక్షల నగదును చోరీ చేశారు. సాయంత్రం ఇంటికి వచ్చిన బాధిత కుటుంబ సభ్యులు చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి ఎస్ఐ కళ్యాణ్ కుమార్ చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్ టీంతో వేలిముద్రలను సేకరించారు. సీసీ కెమెరాల సహాయంతో నిందితులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. కాగా, స్వర్ణకారుడు సంజీవ్ ఆచారికి వివిధ గ్రామాలకు చెందిన వారు బంగారం, వెండి ఆభరణాలను ఆర్డర్ ఇవ్వడంతో, తయారు చేసి ఇంట్లో భద్రపరిచినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.


మంచాలకట్టలో సాగు అవుతున్న మినుము


మంచాలకట్టలో మొక్కజొన్న


మల్లేశ్వరం సమీపంలో సాగు చేసిన జొన్న

కృష్ణానదిలో తీరొక్క పంటలు


కృష్ణా నదీతీరంలో నల్లరేగడి భూమి

మినుములు, నువ్వులు, వేరుశనగ పంటల సాగు

- నాణ్యతతో పాటు అధిక దిగుబడులు
- 1500 నుంచి 2000 ఎకరాల్లో పంట పొలాలు

పెంట్లవెల్లి: ప్రతి యేటా కృష్ణానదిలో నీరు తగ్గే కొద్ది తీరొక్క పంటలను రైతులు సాగు చేస్తారు. కృష్ణా నదీతీరాన ఉన్న ఒండ్రుమట్టిలో నది ఎండిన తర్వాత నాణ్యమైన రకరకాల పంటలను పండిస్తుంటారు. శ్రీశైలం ప్రాజెక్ట్ కట్టినప్పుడు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో దాదాపు 2000 ఎకరాల వరకు నల్లమట్టితో కూడిన ఒండ్రు మట్టి పొలాలు ఉండేవి. పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్ట, జటప్రోల్, చెల్లపాడు, మాధవస్వామినగర్, మల్లేశ్వరం, సోమశిల, అమరగిరి వాసులు కృష్ణానదిలో పొలాలున్న రైతుల దగ్గర కౌలురైతులు కౌలుకు తీసుకొని నీరు తీస్తుండేకొద్ది సాగు చేస్తూ తీరొక్క పంటలను సాగు చేస్తున్నారు. ఈ పంటలు నాణ్యతతో పాటు అధిక దిగుబడులు ఇచ్చేవి. ముఖ్యంగా మినుములు, నువ్వులు, వేరుశనగ, మొక్కజొన్న, శనగ, పొద్దుతిరుగుడు పంటలను అధికంగా సాగుచేస్తారు. వివిధ గ్రామాల రైతులు 1500 నుంచి 2000 ఎకరాల వరకు పంట సాగు అవుతున్నాయి.

రూ.10వేల నుంచి రూ.15వేలు కౌలు పెట్టి..

ఈ పొలాలు కృష్ణానది నీటిలో దాదాపు ఆరు నెలలపాటు మునిగి ఉంటాయి. అందులో పదును, తేమతో ఎక్కువగా పంటలు పండుతాయి. దీంతో నీరు పెట్టడం తక్కువ మోతాదులోనే ఉంటుంది. ఎరువులు కూడా తక్కువగానే వాడుతుంటారు. ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15వేలు కౌలునకు తీసుకొని మరీ ఈ పొలాలను సాగుచేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్ గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు చేపలు పట్టడంతో పాటు పంటలు కూడా సాగు చేస్తారు.

ప్రతి ఏడాది మునకకు గురై..

శ్రీశైలం ప్రాజెక్ట్ కట్టినప్పుడు దాదాపు వేల ఎకరాలు ముంపునకు గురయ్యాయి. కొల్లాపూర్ నియోజకవర్గంలోని కృష్ణానదీ పరివాహక ప్రాంతాల కొన్ని గ్రామాల ప్రజలు కృష్ణానదికి దగ్గర్లో నూతనంగా గ్రామాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం కృష్ణానదిలో ఈభూములు మునకకు గురైన తర్వాత మళ్లీ నీరు తీశాక అక్కడే ఉన్న కొంతమంది రైతులు భూములను వ్యవసాయం చేసుకుంటారు. మరికొందరు మునకకు గురైనప్పుడు ఆ గ్రామాలు వదిలిపెట్టి ఇతర ప్రాంతాలకు వెళ్లినవారి భూములను అక్కడే ఉన్న రైతులు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటారు.


కృష్ణానది తీరంలో నువ్వుల పంట


మల్లేశ్వరంలో వేరుశనగ పంట

ఎరువులు వాడం


ఈ పొలాల్లో ఎరువులు వాడకుండానే పంటలు సాగుచేస్తాం. తేమ నీళ్లకు వివిధ రకాల పంటలు పండిస్తాం. అధిక దిగుబడులు వస్తాయి. – శివ, రైతు, మంచాలకట్ట

మంచి దిగుబడులు


ప్రతి యేడు కాలానికి తగినట్లుగా రకరకాల పంటలు వేస్తూ సరైన మోతాదులో ఎరువులు వాడుకొని పంటలు సాగు చేస్తా. ఇతర పొలాల కంటే ఈ నల్లరేగడి పొలాల్లో మంచి దిగుబడులు వస్తాయి. – శేఖర్, మల్లేశ్వరం

మినుములు, నువ్వులు పండిస్తా


ప్రతి సంవత్సరం జటప్రోల్ గ్రామ శివారులో 10 ఎకరాల్లో మినుములు, నువ్వుల పంట పండిస్తా. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పంటలు పండించి లాభాలు పొందుతున్నా. – భీంరెడ్డి, జటప్రోల్

తక్కువ ఖర్చుతో..


నల్లరేగడి పొలాలు కనుక ఎకరాకు నువ్వుల పంట 6 క్వింటాళ్లు, మినుములు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయి. అతి తక్కువ ఖర్చుతో ఈ పంటలను పండిస్తాం. – బాలరాజు, రైతు

ఔటర్‌పై ఘోర ప్రమాదం

- అతివేగంగా వచ్చి ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ఇద్దరి దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఇబ్రహీంపట్నం రూరల్: ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం 4 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. రావిర్యాల వండర్‌లా సమీపంలోని ఎగ్జిట్ నంబరు 13 దాటిన అనంతరం 200 మీటర్ల దూరంలో డివైడర్‌పై ఉన్న మొక్కలకు హెచ్‌ఎండీఏ ట్యాంకర్ ద్వారా కొంగరకలాన్‌కు చెందిన చెనమోని రాములు (55) నీళ్లు పోస్తున్నాడు. ఉప్పల్‌లో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై ఘట్‌కేసర్ వద్ద ఔటర్ ఎక్కిన వనపర్తి జిల్లా చిన్నంబాయి మండలం బెక్కం గ్రామానికి చెందిన కోశిక రవీందర్‌రెడ్డి, బత్తిని కృష్ణారెడ్డి (టీఎస్07జెఎం 1210) కారులో అతివేగంగా వెనుక నుంచి వచ్చి ట్యాంకర్‌తో నీరు పోస్తున్న రాములును ఢీకొట్టారు. దీంతో అతడు గాల్లో ఎగిరి డివైడర్‌పై పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు.. ట్యాంకర్ వెనుకభాగం కిందికి దూసుకెళ్లింది. దీంతో కారు ముందు సీట్లో కూర్చున్న కోశిక రవీందర్‌రెడ్డి (50) అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. కారు నడుపుతున్న బత్తిని కృష్ణారెడ్డి (45) పరిస్థితి విషమంగా ఉండటంతో నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో కారు 120- 140 స్పీడ్‌లో ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ట్యాంకర్ కిందికి దూసుకెళ్లడంతో రవీందర్‌రెడ్డి మృతదేహంతో పాటు కృష్ణారెడ్డిని బయటకు తీసేందుకు పోలీసులు ఎంతో శ్రమించాల్సి వచ్చింది. సీఐ రాఘవేందర్‌రెడ్డితో పాటు ఎస్ఐ వెంకటేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు స్నేహితులు..

రోడ్డు ప్రమాదానికి గురైన కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి ఇద్దరూ ఒకే గ్రామానికి చెందిన స్నేహితులు. కృష్ణారెడ్డి కొండాపూర్‌లో ఉంటూ స్వీట్ షాప్ నిర్వహిస్తుండగా, రవీందర్‌రెడ్డి బోరబండలో ఉండేవాడు. వీరి మృతితో బెక్కంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన రాములు ఓ కాంట్రాక్టర్ వద్ద కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. ఎస్ఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. మండలంలోని జమిస్తాపూర్‌కు చెందిన భీమయ్యగౌడ్ (70) స్వగ్రామం నుంచి మహబూబ్‌నగర్‌కు సైకిల్‌పై వస్తుండగా.. పాలమూరు యూనివర్సిటీ ఎదుట కంటెయినర్ ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

❒ మరో ఘటనలో ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. జడ్చర్ల మండలం ఉద్దండాపూర్‌కు చెందిన శ్రీశైలం (40) తన భార్య లక్ష్మితో కలిసి గురువారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తుండగా.. కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీశైలానికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య లక్ష్మికి స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. వన్‌టౌన్ ఎస్ఐ శీనయ్య వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్‌కు చెందిన ఈశ్వరమ్మ (60) కొడుకు శివరాజ్ గతనెల 20న మృతిచెందాడు. అతడి అంత్యక్రియల కోసం వైకుంఠ రథంపై వెళ్తున్న క్రమంలో మార్గమధ్యంలోని పెద్ద శివాలయం వద్ద రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి వాహనం ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో ఈశ్వరమ్మకు తీవ్రగాయాలు కావడంతో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి కొడుకు అంబుదాస్ ఫిర్యాదు మేరకు వైకుంఠ రథం డ్రైవర్ ఇసాక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుట్టెడు దుఃఖంలోనూ ఇంటర్ పరీక్ష

- పరీక్ష అనంతరం తండ్రి అంత్యక్రియలకు హాజరైన విద్యార్థి

అలంపూర్ రూరల్: తండ్రి మరణాన్ని పంటిబిగువన ఆపి.. పుట్టెడు దుఃఖంలోనూ ఇంటర్ పరీక్ష రాశాడు ఓ విద్యార్థి. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలంలోని లింగన్‌వాయి గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా(50)కు ఇద్దరు సంతానం. కాగా చిన్న కుమారుడు సమీర్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే సమీర్ తండ్రి మహబూబ్‌బాషా బుధవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం ఇంటర్ సెకండియర్ పరీక్ష ప్రారంభం కానుండగా.. ఈ విషయాన్ని సమీర్‌కు ముందు తెలపకుండా పరీక్షకు వెళ్లే ముందు చెప్పారు. తండ్రి మరణ వార్త తెలిసిన సమీర్ పంటి బిగువన దుఃఖాన్ని ఆపుకొని పరీక్ష పూర్తి చేశాడు. పరీక్ష అనంతరం స్వగ్రామానికి వచ్చి తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.


పరీక్ష అనంతరం స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరిన సమీర్

మరో దూడను హతమార్చిన హైనా

- వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు జంకుతున్న రైతులు

తిమ్మాజిపేట: మండలంలోని చేగుంట శివారులో సంచరిస్తున్న హైనా గురువారం మరో దూడపై దాడిచేసి హతమార్చింది. చేగుంటకు చెందిన రైతు తుంగని బాలయ్య బుధవారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో గేదెలను కట్టివేసి ఇంటికి వచ్చారు. గురువారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా.. హైనా దాడిలో మృతిచెందిన దూడను గుర్తించారు. అయితే వ్యవసాయ పొలాల వద్ద పశువుల పాకలపై హైనా ఆకస్మిక దాడులు చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. అయితే ఫారెస్టు అధికారులు ఏ జంతువు అనేది గుర్తించక పోగా.. కనీసం బోను కూడా ఏర్పాటు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ముగ్గురు రైతులకు చెందిన దూడలను హతమార్చిందని.. ఫారెస్టు అధికారులు మాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అడవి జంతువును పట్టుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఐదుగురికి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కనకయ్యగౌడ్

బిజినేపల్లి: గుట్టుగా గంజాయి సరఫరా చేస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కనకయ్యగౌడ్ తెలిపారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలంలోని వసంతాపూర్ శివారులో బుధవారం జార్కండ్ రాష్ట్రానికి చెందిన బిట్టు కుమార్ రాం, పుప్పుకుమార్, గుడ్లనర్వకు చెందిన మహేష్, దుర్గాప్రసాద్, ఉదయ్ బిజినేపల్లిలో గంజాయి సరఫరా చేస్తుండగా ఎస్ఐలు శ్రీనివాసులు, రాజశేఖర్ ప్రత్యేక నిఘా ఉంచి పట్టుకున్నారని తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని.. వీరి నుంచి 900 గ్రాములకు పైగా గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్‌లు శ్రీనివాసులు, రాజశేఖర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

సారూ.. మా బతుకులు ఆగమైపోతున్నాయ్

- మాజీమంత్రితో ఓ రైతు ఆవేదన


దమాయపల్లి గ్రామ రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కోయిలకొండ: సారూ.. మా బతుకులు ఆగమైపోయాయ్.. రైతు రుణమాఫీ రాలే.. రైతుబంధు పడలే.. కరెంటు సక్కగా లేదు.. బోర్లలో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి సారు అంటూ.. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో ఓ రైతు తన గోడు వెళ్లబోసుకున్నారు. గురువారం ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండలంలోని దమాయపల్లి వద్ద బాలయ్య అనే రైతు వ్యవసాయ పొలంలో కొత్తగా వేస్తున్న బోరును చూసి అక్కడికి వెళ్లి రైతును పలకరించారు. దీంతో రైతు మాట్లాడుతూ నాలుగున్నర ఎకరాల వరి పూర్తిగా ఎండిపోయింది.. పంటను కాపాడేందుకు మళ్లో బోరు వేస్తున్న.. 300 ఫీట్లు దాటిన చుక్క నీరు లేవు.. మొత్తం రాళ్లు, రప్పలే వస్తున్నాయి అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. మీరే ఏదైనా చేయండి సార్ అంటూ వేడుకున్నారు. మళ్లీ కాంగ్రెస్ పాలనలో పాత రోజులు వచ్చినాయని వాపోయాడు. ఇది ఒక్క బాలయ్య ఆవేదనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని మాజీ మంత్రి పేర్కొన్నారు. సాగునీటి నిర్వహణ సరిగా లేకపోవడంతో జలాశయాల్లో ఉన్న నీరంతా ఖాళీ అయ్యిందని, రిజర్వాయర్ల కింద పంటలన్నీ ఎండిపోతున్నాయని, ఈ దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రైతు రుణమాఫీ చేసి ఉంటే.. రైతుబంధు సకాలంలో వేసి ఉంటే.. 24 గంటల కరెంటు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదే కాదన్నారు. ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం బాధ్యత వహించి ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆపద మిత్రలు అప్రమత్తంగా ఉండాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామాల్లో జరిగే విపత్తుల సందర్భంగా ఆపద మిత్రలు అప్రమత్తమై గోల్డెన్ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌డీఆర్‌ఎఫ్ రాష్ట్ర నోడల్ అధికారి గౌతమ్ అన్నారు. గురువారం జెడ్పీ హాల్‌లో ఆపద మిత్రలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విపత్తుల నివారణ సంస్థతో చేసుకొన్న ఒప్పందం ప్రకారం రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ జిల్లాలో 300 మంది ఆపద మిత్ర వలంటీర్లకు 3 దశలలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రమాదాలు జరినప్పుడు ఎలా వ్యవహరించాలో వారికి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో గోల్డెన్ సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర అధికారులు ఆర్‌ఎస్ మిశ్రా, లికున్ పాత్రా, జిల్లా ఫైర్ అధికారి కిశోర్, తహసీల్దార్ జె. సువర్ణరాజు, జిల్లా శిక్షణ కేంద్ర కోఆర్డినేటర్ హన్మంతు పాల్గొన్నారు.

తెల్లవారితే గృహప్రవేశం.. అంతలోనే గుండెపోటుతో వ్యక్తి మృతి


రాజు (ఫైల్)

తెలకపల్లి: ఎంతో కష్టపడి.. ఇష్టంగా నిర్మించుకున్న ఇల్లు.. తెల్లవారితే నూతన గృహప్రవేశం.. కానీ, అంతలోనే గుండెపోటుతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆ ఇంట్లో విషాదం నింపింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కారువంగ గ్రామానికి చెందిన దొడ్ల రాజు(34) గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఇల్లు గృహ ప్రవేశం ఏర్పాట్లలో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలోనే గురువారం తెల్లవారుజామున గృహ ప్రవేశం ఉండగా.. అర్ధరాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. రాజు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాజుకు భార్య, కూతురు ఉన్నారు.